ఊపిరాడతలేదు సార్

దిగజారుతోన్న కోఠి ఈఎన్‌టీ వైద్యసేవలు.. సర్జరీల కోసం వారాలపాటు నిరీక్షణ

- వైద్య పరీక్షలు బయట చేయించుకోవాల్సిన దుస్థితి
- వేధిస్తున్న సిబ్బంది, వైద్య పరికరాల కొరత
- ఇబ్బందులు పడుతున్న రోగులు
- పట్టించుకోని సర్కార్

సిటీబ్యూరో, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): చారిత్రాత్మక గుర్తింపు ఉన్న కోఠి ఈఎన్‌టీ దవాఖానకు ప్రతి రోజు వందల సంఖ్యలో రోగులు వస్తుంటారు. చెవి, ముక్కు, గొంతు సంబంధిత వ్యాధుల చికిత్సకు ఆ దవాఖానకు ఉమ్మడి రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. కానీ అది ఒక ప్పుడు.. ప్రస్తుతం పాలకుల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో ఈఎన్‌టీ దవాఖాన పనితీరు రోజురోజుకు మసకబారుతోంది. ప్రస్తుతం ఇక్కడ ఏదైనా శస్త్రచికిత్సలు చేయించాలంటే వారాల తరబడి నిరీక్షించాల్సిందే.

వేధిస్తున్న సిబ్బంది కొరత..

నిత్యం వె1000 నుంచి 1200మంది రోగులు ఓపీ సేవలు పొందే ఈ దవాఖానలో 200 నుంచి 250 మంది వరకు ఐపీ సేవలు పొందుతుంటారు. చెవి, ముక్కు, గొంతు వైద్యం కోసం తెలంగాణ నుంచే కాకుండా ఏపీ, కర్నాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి కూడా రోగులు కోఠి ఈఎన్‌టీకి వస్తుంటారు. అయితే ఇటీవల జరిగిన బదిలీలతో ఆస్పత్రిలో సిబ్బంది కొరత తలెత్తింది. బదిలీ అయిన ఖాళీలను భర్తీ చేయకపోవడం, పదవీ విరమణతో ఖాళీ అయిన పోస్టుల్లో కొత్తవారిని నియమించకపోవడంతో రానురాను సిబ్బంది కొరత తీవ్రమై, రోగులకు శాపంగా మారుతోంది.

డాక్టర్ల పోస్టులు ఖాళీ...

కోఠి ఈఎన్‌టీలో మొత్తం ఐదు మంది ప్రొఫెసర్లు ఉండాలి. ఇటీవల జరిగిన బదిలీల్లో ముగ్గురు ప్రొఫెసర్లు బదిలీ కావడంతో ప్రస్తుతం ఇద్దరు ప్రొఫెసర్లు మాత్రమే ఉన్నారు. దీంతో మూడు ప్రొఫెసర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు ఐదు ఉండగా ప్రస్తుతం ముగ్గురే ఉన్నారు. దీంతో 2అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు 14 ఉండగా ఇప్పుడు కేవలం 6 మంది మాత్రమే ఉన్నారు.

ఫార్మసిస్టులు లేరు...

దవాఖానలో ఫార్మసిస్టుల పాత్ర కీలకం. వైద్యులు రాసిన మందులను సరిగ్గా ఇవ్వాలంటే ఫార్మసిస్టులు కావాలి. అయితే కోఠి ఈఎన్‌టీ దవాఖానలో నాలుగు ఫార్మసిస్టు పోస్టులు ఉండగా ప్రస్తుతం ఒక్కరు కూడా లేరు.

అరకొరగా నర్సింగ్ సిబ్బంది..

వైద్యసేవల్లో మరో కీలక పాత్ర పోషించేది నర్సింగ్ సిబ్బంది. ఈఎన్‌టీలో సరిపోను నర్సింగ్ సిబ్బంది కూడా లేకపోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. సుమారు 50శాతం మంది మాత్రమే నర్సింగ్ సిబ్బంది అందుబాటులో ఉండటంతో వైద్యసేవలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని రోగులు వాపోతున్నారు.

వైద్యపరీక్షలూ బయటనే....

మందులు, వైద్యపరీక్షల కోసం రోగులను బయటకు పంపవద్దని అధికారులను ఆదేశించడంతో పాటు అందుకు అవసరమైన మందులు, వైద్య పరికరాలను సమకూర్చి, నిరుపేద రోగులకు ఇబ్బందులు కలగకుండా నాటి కేసీఆర్ సర్కార్ విప్లవాత్మక చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. అయితే అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే కాంగ్రెస్ సర్కార్ వైద్యశాఖను ఐసీయూలోకి నెట్టేసింది. బీఆర్ఎస్ హయాంలో ఈఎన్‌టీలో సరిపడా సిబ్బందిని నియమించడంతో పాటు అత్యాధునిక వైద్యపరికరాలు, మందులను సమకూర్చగా ప్రస్తుత రేవంత్ సర్కార్ ఉన్న ఉద్యోగులను బదిలీల పేరుతో వేరేచోటకు తరలించడంతో పాటు నూతన సిబ్బందని కేటాయించడంలేదనే విమర్శలున్నాయి . దీనికి తోడు సీటీ స్కాన్, ఎక్స్‌రే వంటి వైద్యపరీక్షలన్నీ బయటనే చేయించుకోవాల్సిన దుస్థితి నెలకొన్నట్లు రోగులు ఆరోపిస్తున్నారు.

మూడు వారాలు ఆగమంటున్నారు..

'ముక్కలో ధూలం అడ్డు వచ్చి ఊపిరాడ్తలేదని కోఠి ఈఎన్‌టీ ఆసుపత్రికి వెళ్తే పరీక్షించిన డాక్టర్లు.. కొన్ని టెస్టులు రాశారు. డాక్టర్లు రాసిన చీటీ తీసుకుని కౌంటర్ వద్ద చూపిస్తే ఈ పరీక్షలు గీడ లేవు, బయట చేపించుకోవాలని చెప్పిండ్రు. దేవుడా అని పరీక్షలన్నీ బయటనే చేపిచ్చినం. అనంతరం ఆపరేషన్ చేస్తామని చెప్పి ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకున్నారు. అయితే మరుసటిరోజే నర్సు వచ్చి మీకు ఆపరేషన్ ఇప్పుడే చెయ్యరని, డిశ్చార్జ్ చేస్తారని చెప్పింది. ఇదేంటని డాక్టర్ దగ్గరకు పోయి అడిగితే మీకన్నా ముందు చాలామంది ఉన్నారు. మీకు మూడు నాలుగు వారాల తర్వాత చేస్తం అని చెప్పారు. ఆ మూడు వారాలయ్యే సరికి నా ఊపిరి ఆయింత ఆగిపోయేటట్లే ఉంది' అంటూ ఒక బాధితుడు తన గోడు వెల్లబోసుకున్నాడు. అయితే ఇలాంటి బాధితులు ఈఎన్‌టీలో రోజుకు ఎంతోమంది తిరిగిపోతున్నట్లు సమాచారం.

స్విమ్మర్లను అభినందించిన కేటీఆర్

గోల్నాక, ఏప్రిల్ 10: ఇటీవల జరిగిన అంతర్జాతీయ స్విమ్మింగ్ పోటీల్లో విజేతలుగా నిలవడంతో పాటు ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించుకున్న బర్కత్‌పురకు చెందిన క్వీన్ విక్టోరియా, ఆమె కుమారుడు స్టీఫెన్ కుమార్ గురువారం మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారిని అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని బీఆర్ఎస్ తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కేటీఆర్‌తో పాటు ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, కౌశిక్ రెడ్డి ఉన్నారు.



బ్యాలెట్ పోలింగ్‌పై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అధికారులు

పోలింగ్ విధులపై అవగాహన ఉండాలి

నోడల్ అధికారి డాక్టర్ సునంద

సిటీబ్యూరో, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): పోలింగ్ విధులపై సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఎన్నికల ట్రైనింగ్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి డాక్టర్ సునంద రాణి పేర్కొన్నారు. హైదరాబాద్ లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా గురువారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, ఓపీఓలకు తొలి విడత ఎన్నికల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్స్ వారికి ఎన్నికల నియమ నిబంధనలు, బ్యాలెట్ బాక్సుల సీల్ విధానం, బ్యాలెట్ పేపర్స్, అవసరమైన ఫారాలు పూరించడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. డెమో బ్యాలెట్ బాక్స్ ద్వారా వారితో ప్రత్యక్షంగా చేయించి హ్యాండ్స్ ఆన్ శిక్షణను ఇచ్చారు. శిక్షణలో పీఓలు, ఏపీఓలకు తలెత్తిన సందేహాలను మాస్టర్ ట్రైనర్స్ నివృత్తి చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు విజయలక్ష్మి, మమత, పీఓలు, ఏపీఓలు, మైక్రో అబ్జర్వర్లు, ఓపీఓలు తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుల అరెస్టులు అన్యాయం

తెలంగాణ విశ్వవిద్యాలయాల కాంట్రాక్ట్ అధ్యాపకుల జేఏసీ

ఓయూలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ: తమ డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రాష్ట్రంలోని యూనివర్సిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను అరెస్టు చేయడం అన్యాయమని తెలంగాణ విశ్వవిద్యాలయాల కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా గురువారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ యూనివర్సిటీల బంద్‌కు పిలుపునిచ్చామని, అది విజయవంతమైనదని చెప్పారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రస్తుత మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు తమకు అనుకూలంగా గట్టిగా వాదించి, ఇప్పుడు మౌనంగా ఉండటం బాధాకరమని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే తమ డిమాండ్లను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ తీరు ఇలాగే కొనసాగితే అన్ని సంఘాలతో కలిసి ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు.

మంత్రి తుమ్మలకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సహాయకుని వాటా పెంచండి

సిటీబ్యూరో, ఏప్రిల్10,(నమస్తే తెలంగాణ): తిఫ్ట్ ఫండ్ పథకంలో భాగంగా సహాయకుని వాటాగా చెల్లించే రూ.600ను రూ.800కు పెంచాలని రాష్ట్ర వ్యవసాయ, చేనేత శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావును అఖిల భారత పద్మశాలి సంఘం సెక్రటరీ జనరల్ గడ్డం జగన్నాథం, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమ్మర్తపు మురళి గురువారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ విషయమై తుమ్మల సానుకూలంగా స్పందించారు.

చికిత్సతో వణుకుడు వ్యాధికి చెక్

డాక్టర్ రూపమ్ బోర్గోహైన్

సిటీబ్యూరో, ఏప్రిల్10,(నమస్తే తెలంగాణ): ప్రపంచవ్యాప్తంగా ఉన్న వృద్ధులకు సామాజిక ఆర్థిక భారాన్ని కలిగించే రెండవ అత్యంత తీవ్రమైన న్యూరోడీజెనరేటివ్ డిజార్డర్ పార్కిన్సన్స్ వ్యాధి అని.. అవగాహన, సరైన చికిత్స ద్వారానే ఇది నయమవుతుందని పార్కిన్సన్స్ డిసీజ్ అండ్ మూవ్మెంట్ డిజార్డర్స్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్, సీనియర్ న్యూరాలజిస్ట్, డాక్టర్. రూపమ్ బోర్గోహైన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. సాధారణ భాషలో వణుకుడు వ్యాధిగా పిలువబడే ఇది, మెదడులో నాడీ కణాలు దెబ్బదినటం, క్షీణించటం కారణంగా వస్తుందని, భారతదేశంలో వివిధ అధ్యయనాల ప్రకారం ప్రతీ లక్ష మంది జనాభాకు 15 నుంచి 43 మందిలో ఈ పార్కిన్సన్స్ వ్యాధి ప్రాబల్యం ఉందని అన్నారు. ఈ "వణుకుడు" వ్యాధిని ముందుగా గుర్తించిన డాక్టర్. జేమ్స్ పార్కిన్సన్ పేరున ఈ వ్యాధికి "పార్కిన్సన్స్" వ్యాధిగా నామకరణం చేసి, ఆయన జన్మదినమైన ఏప్రిల్ 11న ప్రపంచ పార్కిన్సన్స్ డేగా జరుపుకుంటున్నారని తెలిపారు. వణుకుడి వ్యాధి చికిత్స చేస్తే నయమవుతుందని అవగాహన పెంచుకోవాలన్నారు.

మంత్రివర్గంలో లంబాడీలకు చోటు ఇవ్వాలి

సీఎం ఇంటి ముట్టడికి బంజారా సంఘం నేతల యత్నం

లంబాడీ సేవా సంఘం నేతలను అడ్డుకుంటున్న పోలీసులు

బంజారాహిల్స్,ఏప్రిల్10: మంత్రివర్గంలో లంబాడాలకు స్థానం కల్పించాలని డిమాండ్ చేస్తూ సేవాలాల్ బంజారా సంఘం నేతలు గురువారం జూబ్లీహిల్స్ లోని సీఎం రేవంత్ రెడ్డి నివాసం ముట్టడికి ప్రయత్నించారు. సంఘం వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు కొర్ర మోతిలాల్ నాయక్ నాయకత్వంలో పలువురు నాయకులు సీఎం రేవంత్ ఇంటివైపు దూసుకువెళ్లేందుకు యత్నించగా జూబ్లిహిల్స్ పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మోతీలాల్ నాయక్ మాట్లాడుతూ..అగ్రకుల అధిపత్యంలో నలిగిపోతున్న లంబాడాలకు మంత్రివర్గంలో స్థానం కల్పించి గుర్తింపు నివ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆందోళన కారులను అరెస్ట్ చేసి బొల్లారం, తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌లకి తరలించారు. సేవలాల్ బంజారా సంఘం మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు సక్రిబాయి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కొర్ర చందు నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లావుడియా ప్రసాద్ నాయక్, జాతీయ ఉపాధ్యక్షుడు ధరావత్ గణేష్ నాయక్, రమావత్ అభిషేక్ నాయక్, రాజేష్ నాయక్, శాంతిబాయ్, నాగు నాయక్, లాలు నాయక్, శ్యామల నాయక్, సేవాలాల్ బంజారా సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు రాంబాబు నాయక్, జిల్లా కార్యదర్శి నాగరాజు నాయక్, నాయకులు శీను నాయక్ తదితరులను పోలీసులు అరెస్ట్ చేశారు.

అవగాహనతోనే సైబర్ నేరాల అడ్డుకట్ట

సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏసీపీ కేవీఎం ప్రసాద్

సిటీబ్యూరో, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): ఇంటర్‌నెట్ భద్రతపై ప్రతి ఒక్కరు అవగాహన కల్గి ఉండాలని, తద్వారా ఆన్‌లైన్ ద్వారా జరిగే సైబర్ నేరాలను అడ్డుకట్ట వేయవచ్చని సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏసీపీ కేవీఎం ప్రసాద్ అన్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు 131 వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా సైబర్ నేరాలను అరికట్టడంలో భాగంగా గురువారం సైబర్ అవేర్‌నెస్ వాక్ థాన్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరాలు, ఇంటర్‌నెట్ భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. స్పెషల్ చీఫ్ గెస్ట్‌గా హాజరైన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ చిన్మయ్ కుమార్ మాట్లాడుతూ.. లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు, బ్యాంకింగ్ విభాగం సమన్వయంతో ఆన్‌లైన్ మోసాలను అడ్డుకొంటూ డిజిటల్ బ్యాంకింగ్‌కు భద్రత కల్పించాలని అన్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) చీఫ్ జనరల్ మేనేజర్ అండ్ జోనల్ మేనేజర్ సునీల్‌కుమార్ చుంగ్ మాట్లాడుతూ.. పీఎన్‌బీ డిజిటల్ భద్రతకు కట్టుబడి ఉంటూ వినియోగదారులకు నిరంతరం సైబర్ అవేర్‌నెస్‌ను నిర్వహిస్తూ సురక్షితమైన బ్యాంకింగ్ సేవలు అందిస్తున్నామన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

డీసీఎంస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి

మేడ్చల్, ఏప్రిల్ 10(నమస్తే తెలంగాణ): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ఎప్పుడా అని రైతులు ఎదురుచూస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా యాసంగిలో 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు అధికారులు అంచనా వేసినప్పటికీ కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి మరో వారం రోజులు పట్టే అవకాశం ఉంది. జిల్లాలో ఇప్పటికే వరి కోతలు కూడా ప్రారంభమయ్యాయి. ధాన్యం మొదటి రకానికి రూ.3,229, రెండవ రకానికి రూ.2,300 ధరను ప్రభుత్వం నిర్ణయించింది.. అయితే సన్న బియ్యానికి రూ.500 బోనస్ అందిస్తామని ఓ వైపు ప్రభుత్వం ప్రకటించినప్పటికీ గత సీజన్‌లోనే సన్న వడ్లకు బోనస్ అందించడం ఆలస్యం కావడంతో పాటు కొంతమంది రైతులకు బోనస్ అందక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. యాసంగి సీజన్‌లో సన్న వడ్లను విక్రయించిన రైతులకు బోనస్‌ను తక్షణమే అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధాన్యం కోతకు రాకముందే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేదని డీసీఎంస్ వైస్ చైర్మన్‌మధుకర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు ప్రక్రియను కూడా అధికారులు పకడ్బందీగా చేపట్టేవారు.. అలాగే కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అన్ని సౌకర్యాలను కల్పించేవారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై తాత్సారం చేస్తోంది. ఇప్పటికే చాలా ఆలస్యం అయ్యిందని వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి. లేకుంటే ఆందోళన కార్యాక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

ప్రీ ఈవెంట్ బ్రౌచర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ సీవీ ఆనంద్ తదితరులు

మహిళల భద్రతే లక్ష్యంగా స్త్రీ సమ్మిట్

నగర సీపీ సీవీ ఆనంద్

సిటీబ్యూరో, ఏప్రిల్ 10(నమస్తే తెలంగాణ): మహిళల భద్రతను మరింత పెంచడమే లక్ష్యంగా హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్‌తో కలిసి సిటీ పోలీసులు స్త్రీ సమ్మిట్-2025 పేరుతో సదస్సు ఏర్పాటు చేస్తున్నారు. షి ట్రయిస్ విత్ రెస్పెక్ట్, ఈక్వాలిటీ అండ్ ఎంపవర్‌మెంట్ అనే యూఎన్ ప్రతిపాదించిన మహిళా అంశాన్ని ప్రధానంగా తీసుకుని సమ్మిట్ నిర్వహిస్తున్నారు. ఈ రెండవ ఎడిషన్ ఈనెల 15న బంజారాహిల్స్ లోని తాజ్‌డక్కన్ హోటల్‌లో జరుగుతుందని, ఉదయం పదిగంటల నుంచి ప్రారంభమయ్యే ఈ సమ్మిట్‌లో ప్రభావవంతమైన మహిళలు, నిపుణులు, అన్ని రంగాల వారిని ఒక దగ్గరికి చేర్చి చర్చ నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. గురువారం సమ్మిట్‌కు సంబంధించిన ప్రి ఈవెంట్‌ను రిలీజ్ చేసిన హెచ్‌సిఎస్‌సి చైర్మన్ , సీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. మహిళల భద్రత తమ నైతిక బాధ్యత అన్నారు. ఈ సమ్మిట్‌లో ప్యానెల్ చర్చలు, ప్రముఖ వక్తల కీనోట్ ప్రజెంటేషన్లు, ఇంటరాక్టివ్ వర్క్ షాపులు, నెట్‌వర్కింగ్ అవకాశాలు ఉంటాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సిఎస్‌సి జనరల్ సెక్రటరీ శేఖర్‌రెడ్డి, మహిళా ఫోరమ్ సంయుక్త కార్యదర్శి గీతాగోటి పాల్గొన్నారు.

ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయాలి

యండీయూవీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్ మాదిగ

రవీంద్రభారతి,ఏప్రిల్ 10: నాలుగు దశాబ్దాల ఎస్సీ వర్గీకరణ ఉద్యమాన్ని గుర్తించిన సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణ చేసుకునే అధికారం రాష్ట్రాలకు ఇస్తూ తీర్పు వెలువరించిన అనంతరం తెలంగాణ రాష్ట్రంలో వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదింపజేసిందని.. అయితే ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అనేక మంది ఉద్యమకారులపై కేసులు పెట్టారని తక్షణమే ఆయా కేసులు ఎత్తివేయాలని మాదిగ దండోర ఉద్యమకారుల వేదిక(యండీయూవీ)తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు.గురువారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో మీడియా సమావేశంలో యండీయూ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్ మాదిగ, చైర్మన్ డా.రుద్రవరం లింగస్వామి మాదిగ మాట్లాడుతూ.. వర్గీకరణ పోరాటంలో ఉద్యమకారులపై నమోదైన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, ఉద్యోగం, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డా.వకంటిగల్ల వెంకట్‌మాదిగ, మీసాల కురుమయ నక్క రమేష్, బాలకృష్ణ, యాదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రేడింగ్ పేరుతో రూ.2 కోట్లకు టోకరా

నిందితుడి అరెస్టు

నిందితుడు శ్రీనివాస్‌రెడ్డి

సిటీబ్యూరో, ఏప్రిల్ 10(నమస్తే తెలంగాణ): ఆన్‌లైన్ స్టాక్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే రెండింతల నుంచి మూడింతల లాభాలు ఇప్పిస్తామంటూ ఆశపెట్టి ఆన్‌లైన్‌లో మోసం చేసిన వ్యక్తిని సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. హైదరాబాద్‌కు చెందిన ఫిర్యాదుదారుడికి ఇటీవల టీనామిట్టల్ నుంచి పెట్టుబడి సలహా కోసం వాట్సప్ గ్రూపులో చేరమని సలహా ఇచ్చారు. బాధితుడు ట్రేడింగ్ యాప్ ద్వారా దాదాపు రూ.2 కోట్ల వరకు పెట్టుబడి పెట్టాడు. అయితే కొద్దిరోజుల తర్వాత బాధితుడు డిపాజిట్స్ ఉపసంహరించుకోవడానికి ప్రయత్నిస్తే మొత్తం డిపాజిట్‌లో 5శాతం చెల్లించమని అడిగారు. తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈనేరంలో పాలుపంచుకున్న తిలక్ నగర్‌కు చెందిన పకీర్ శ్రీనివాస్‌రెడ్డిని పోలీసులు గురువారం అరెస్ట్‌చేశారు. శ్రీనివాసరెడ్డిపై దేశవ్యాప్తంగా ఐదు కేసులున్నాయని పోలీసులు తెలిపారు.

పెండింగ్ వేతనాలివ్వాలి

సిటీబ్యూరో, ఏప్రిల్10, (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న ఎంసీహెచ్ కిట్ డేటా ఎంట్రీ ఆపరేటర్లు(డీఈవో) నాలుగు నెలలపెండింగ్ వేతనాలు ఇప్పించాలని కోరుతూ గురువారం ఆరోగ్య శాఖ కమిషనర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీతాలు మరియు పెండింగ్‌లో ఉన్న బకాయిలు తక్షణమే విడుదల చేయడంతో పాటు ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి నేరుగా జీతాలు మంజూరు చేయాలని కోరారు.

న్యాక్‌లో నేషనల్ సెమినార్

కాచిగూడ, ఏప్రిల్ 10: ఇండియన్ బిల్డింగ్స్ కాంగ్రెస్(ఐబీసీ) న్యూఢిల్లీ తెలంగాణ రోడ్లు భవనాల శాఖ సహకారంతో శుక్ర, శనివారం(రెండు రోజులపాటు) హైదరాబాద్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్(ఎన్ఏసీ) ప్రాంగణంలో ఇన్నోవేషన్స్ ఇన్ బిల్డింగ్స్ అండ్ ఎన్విరాన్మెంట్ అనే అంశంపై నేషనల్ సెమినార్ నిర్వహిస్తున్నట్లు ఇండియన్ బిల్డింగ్స్ ప్రతినిధులు తెలిపారు. గురువారం కాచిగూడలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఇండియన్ బిల్డింగ్స్ నిర్మాణ రంగానికి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధికి నిర్మాణ నాణ్యతను మెరుగుపరచడానికి తక్కువ వ్యయంతో నిర్మించనున్నట్లు వారు తెలిపారు.

ఐపీఎల్ మ్యాచ్ నేపథ్యంలో..

రేపు ఉప్పల్ స్టేడియం పరిసరాలలో ట్రాఫిక్ ఆంక్షలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ క్రికెట్ స్టేడియంలో శనివారం సన్‌రైజర్స్ హైదరాబాద్, పంజాబ్ కింగ్స్ మధ్య ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ ఉండటంతో స్టేడియం పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు రాచకొండ సీపీ సుధీర్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 11.50 వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని తెలిపారు. చంగిచర్ల, బొడుప్పల్, పీర్జాదీగూడ వైపు నుంచి వచ్చే వాహనాలను హెచ్ఎండీఏ భాగాయత్ నుంచి నాగోల్ వైపు, ఎల్బీనగర్ వైపు నుంచి వచ్చే వాహనాలను నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద నుంచి హెచ్ఎండీఏ లేఅవుట్ వైపు, తార్నాక నుంచి వచ్చే వాహనాలను హబ్సిగూడ నుంచి చర్లపల్లి వైపు, రామంతాపూర్ నుంచి వచ్చే వాహనాలు స్ట్రీట్ నెంబర్ 8 నుంచి హబ్సిగూడ వైపు మళ్లిస్తున్నట్లు వెల్లడించారు.

మూసీ పునరాభివృద్ధికి సబర్మతి టూర్

మంత్రి పొన్నం ప్రభాకర్

సిటీ బ్యూరో, ఏప్రిల్ 10(నమస్తే తెలంగాణ): మూసీ పునరాభివృద్ధి కోసం సబర్మతి నదిని పరిశీలించేందుకు పార్టీలకు అతీతంగా జీహెచ్ఎంసీ మేయర్, 150 మంది కార్పొరేటర్లను తీసుకెళ్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గుజరాత్‌లోని సబర్మతి నదిని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, సీఎం సలహాదారు వేంనరేందర్‌రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డితో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సబర్మతి నదిలాగానే మూసీని అభివృద్ధి చేసే అంశాలను అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నామని మంత్రి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మూసీ పునరాభివృద్ధికి ఫేజ్-1 కింద బాపు ఘాట్ వరకు చేసే అభివృద్ధిపై స్టడీ టూర్ ద్వారా జీహెచ్ఎంసీ బృందంతో పరిశీలిస్తామని చెప్పారు.

తాగునీటి సరఫరాలో అంతరాయం

సిటీబ్యూరో, ఏప్రిల్10, (నమస్తే తెలంగాణ): హైదర్‌నగర్ నుంచి ఆల్వాల్ వరకు ఉన్న 1200 ఎంఎం డయా ఎంఎస్ గ్రావిటీ మెయిన్ పైపులైన్‌కు షాపూర్ నగర్ వ